



పొద్దున్నే వుదయించిన సూర్యుడితో పాటు, నవ్వు మొహంతో నిద్ర లేచిన భానుమూర్తి, సూర్యుడస్తమించిన సాయంత్రానికల్లా మొహం, మనసూ మాడ్చుకున్నాడు.

* * *

భానూమూర్తి ఆ వూరొచ్చి ఆరు రోజులైంది. కాలేజీలో లెక్చరర్‌గా జాయినై ఐదురోజులూ, ప్రిన్సిపాలు గారు రికమెండు చేసిన సందులోని గదిలో దిగి నాల్రోజులూ అయ్యాయి.

ఆ గది వున్న సందు చాలా చిన్నది; గదీ చిన్నదే. ముప్పై రూపాయ లద్దివ్వడాని కొప్పుకున్న ఆ గదిపైట, మూడ్రోజుల్నించీ, కొళాయి దగ్గిర వినబడే ఆడవాళ్ళ బూతులు మాత్రం పెద్దవి. వర్షం వచ్చినప్పుడు ఏర్పడి,

చాలా రోజుల్దాకా కదలని మురికి గుంటలూ పెద్దవే! అంచేత భాను మూర్తికి ఆ గదంటే రోతపుట్టింది. సొంత పూళ్ళో వున్న 'అమ్మని' తీస్కొచ్చెయ్యాలనీ, అందుకు మంచి ఇంటిని గానీ, పోర్షనుగానీ వెతకాలనే కోరికా పుట్టింది.

వూరొచ్చిన ఏడో రోజుని, బస్సు రూటుకోసం ఎడంపక్క వెళ్ళడం మానేసి మెయిన్ ముందికదాని కుడిపక్క నడవడం ప్రారంభించిన భానుమూర్తి ఆ సందు దాటి మరో పెద్దసందు చివర కొచ్చి ఠక్కున ఆగిపోయాడు. అక్కడ వో అందమయిన మేడ వున్నది. రెండో అంతస్తుమీద చక్కని రెండు గదులు భానుమూర్తి రెండు కళ్ళకీ రెండు చిన్నసైజు స్వర్గాల్లా కనిపించేయి. అన్నిటికన్నా ముఖ్యంగా ఆ గోడలకి వేసిన గులాబీరంగు, అతను ఆనర్సు చదువుతున్న రోజుల్లో ప్రేమించిన సరోజ బుగ్గల్లో రోజాలా అందంగా కనిపించింది. ఆ గదులకి వేసిన తాళాలు, తన పేరు రాసి, స్వర్గపు గేటుకి వేసిన సీళ్ళలా కనిపించేయి. మొత్తంమీద ఆ మేడ తీరిన కోరికలా అతి హుందాగానూ, తీరబోయే కోరికలా అతి అందంగానూ వుంది. అనుకోకుండానే ఆ గది లప్పుడే త నద్దెకు తీస్కున్నట్టు ఫీలయేడు భానుమూర్తి. అప్పటి కాలోచన నాపేసి, తిన్నగా కాలేజీకి వెళ్ళిపోయాడు.

సాయంత్రం క్లాసు లైపోగానే, కాఫీ తాగి, ఆ మేడవున్న ఇంటి గేటు తీసి లోపలి కెళ్ళిన భానుమూర్తి, "ఎవ రండీ?" అని మొగమాటంగా పిల్చేడు. ఎవరూ పలకలేదు. "ఏవండీ" అని మారోమారు పిల్చేడు.

"ఏవరూ!" అంటూ బైట కొకాయన వచ్చేడు. ఆయన ఆరడుగుల పొడుగున్నాడు. చూడగానే నమస్కరించాలనే భావం కలిగించే లా వున్నాడు. రాగానే "ఎవరు కావాలి?" అనడిగేడు.

"నా పేరు భానుమూర్తండీ! ఈ వూరి కాలేజీలో కొత్తగా లెక్చరర్ గా చేరేను."

"అలాగా! ఇక్కడెవరికీ ట్యూషన్లక్కర్లేదు," అన్నాడాయన గంభీరంగా.

"అహఁ! అది కాదండీ! ... ఈ మేడమీద గదు లద్దె క్కావాలని..." ఆయన వో రెణ్ణిమిషా లూరుకున్నాడు. "అవి అద్దె కివ్వం," అన్నాడు. భానుమూర్తి వుత్సాహమంతా చచ్చిపోయింది. కాఫీ తాగి అప్పుడే ముట్టించబోయిన గోల్డుఫ్లేక్ సిగరెట్టు రోడ్డు మీదకి జారిపోయినట్టు ఐంది.

"అది కాస్పార్! అందులో ఎవరూ వుండటం లేదుగా! అది మీ రద్దెకిస్తే మా వూర్నించి మా అమ్మగార్ని తీస్కొద్దా మనుకుంటున్నాను."

అన్నాడు భానుమూర్తి చాలా దీనంగా.

ఆయన కొంచెం తల అడ్డంగా తిప్పి, "క్షమించండి..." అన్నాడు. ఇంకా ఏదో అనబోయాడు. భానుమూర్తి ఏమీ అనకుండా వొచ్చేశాడు. బయట కొచ్చి సిగరెట్టు ముట్టించి ఆకాశం వేపు చూశాడు.

ఆకాశంలో సూర్యుడప్పుడే అస్తమిస్తున్నాడు.

పొద్దున్న సూర్యోదయంతోబాటు భానుమూర్తి మొహంలో వెలిగిన చిరునవ్వు ఆ వేళ అలా, సూర్యుడి అస్తమయంతోబాటు ఆరిపోయింది.

* * *

మరో వారంరోజులు వరసగా వెనక్కి వెళ్ళిపోయేయి. మరో నాల్రోజులు పోతే 'దసరా' వస్తుందని కాలేజీకి సెలవు లిచ్చేశారు. దసరాకి రమ్మని అమ్మ రాసిన ఉత్తరం ఆవేళ పోస్టుమేనిచ్చేశాడు. బావులేని మనసు అమ్మ దగ్గర కెళ్ళాక కొంచెమైనా బావుండొచ్చు. అందుకని ఎయిర్ బేగ్‌లో రెండు జతల బట్టలు పడేసొక్కాని, రైలు కింక గంటన్నెముందనగా బస్ స్టాప్‌కి బయలుద్దేరాడు భానుమూర్తి. కాని అంతలోనే...ఎందుకో ఆ మేడ మరోమారు చూడాలనిపించింది.

తనటువైపు వెళ్ళటం లేదు, కాని ఇవాళ వెళ్ళాలనిపించింది. అందుకని అటుపక్క నడవడం ప్రారంభించేడు భానుమూర్తి.

సందు వెనక్కి వెళ్ళిపోయింది. ఆ మేడ దగ్గిరికొచ్చింది... మేడ ఎదురుగా వచ్చింది ... భానుమూర్తి అకస్మాత్తుగా ఆగిపోయాడు. మేడపక్క అదోరకంగా చూశాడు. ఆ చూపులో జాలుంది; దీనత్వం వుంది, పోగొట్టుకో కూడనిదాన్ని పోగొట్టుకున్నా నన్న భావం వుంది. దీనంగా ముందుకు కదలబోయినభానుమూర్తికి కుడివైపునించి ఎవరో చప్పట్లు కొట్టినట్టయింది. భానుమూర్తి మేడవైపు చూశాడు. గేటులోపల ముసలాయన నిలబడి వున్నాడు. భానుమూర్తి అటు చూడగానే రమ్మని పిలిచేడు. భానుమూర్తి దగ్గరగా వెళ్ళేడు.

"సెలవులకి ఊరి కెళ్తున్నారా?" అనడిగాడాయన.

"ఊఁ," అన్నాడు భానుమూర్తి. "మా అమ్మగార్ని తీసుకురావాలి."

"ఇల్లు దొరికిందా?"

"లేదు. కా నేం చేయడం? ఇంటి కన్న అమ్మ రావడమే ముఖ్యం!"

ఆయన జాలిగా నవ్వేడు" మీ అడ్రస్సివ్వండి. మూడొంతులు కొద్ది రోజుల్లోనే వుత్తరం రాస్తాను, మీ రొచ్చి దిగిపోవచ్చు."

భానుమూర్తి నమ్మలేనట్టు చూసేడు. "నిజమేనా?" అన్నాడు




"నిజమే." అన్నాడాయన నవ్వుతూ.

అప్పుడు మళ్ళీ నవ్విన భానుమూర్తి ఆయనకి సొంతవూరి ఎడ్రసిచ్చి, రైలెక్కి, ఇంటి కెళ్ళిన్దాకా ఆనందంగా నవ్వుతూనే వున్నాడు. వారం రోజుల్లోనే భానుమూర్తికి వుత్తరం వచ్చింది. ఉత్తరం చింపేడు భానుమూర్తి.

"నాయనా!

ఏమిటిరాయాలో, ఎలారాయాలో తెలీటంలేదు. కాని రాయక తప్పదు. ఇదివరకు ఆ మేడమీది గదుల్లో నా కొడుకుండేవాడు. ఆ గదులంటే వాడికి ఎంతో ఇష్టం. గోడలకి ఆ గులాబీరంగు వేయించిందికూడా వాడే! కాని రెండేళ్ళకే, నా ఇరవై రెండేళ్ళ కొడుకు ఎమ్మే రెండోఏళ్లో వుండగా నన్నూ, ఆ గదుల్నీ వదిలేసి వెళ్ళిపోయాడు.

ఇప్పటిదాకా అవెవ్వరికీ అద్దెకివ్వలేదు, ఇవ్వదల్చుకోలేదు. కాని నిన్ను చూస్తే, నా రామమే జ్ఞాపకమొచ్చాడు. నిన్ను ఆ గదిలో వుంచ

గలిగితే రామాన్ని నీలో కొంతమట్టు కైన చూచుకోవచ్చని నా ఆశ! మొదటి రోజునే నే చెప్పేది పూర్తిగా వినకుండా వెళ్ళిపోయావు. మరి అటు పక్క రానేలేదు. నిన్న మళ్ళీ వచ్చావు. నీ కోసం ఎదురుచూసిన కళ్ళు నిన్ననే వెలిగేయి. వెంటనే 'అమ్మగార్ని' తీసుకు వచ్చేసెయ్!

రామం ఫోటో కూడా దీన్తో పంపుతున్నాను; ఒకమారు చూడు. ఇంతకన్న చెప్పలేని బాధబాబూ ఇది...! ఆలోచనల్లో వుత్తరం రాయడం ఆలస్యమైపోయింది. అర్థం చేసుకుంటావు కదూ! ఇంతే, వుంటాను...

—రాఘవరావు."

వుత్తరం చదివాక 'రామం' ఫోటో చూసేడు భానుమూర్తి. తన పోలికలే బాగా వున్నాయి. అవే కళ్లు, అదే నవ్వు. అప్రయత్నంగా కళ్ళు మూసుక్కున్నాడు భానుమూర్తి

"అమ్మా! వెళ్ళిపోదాం పద. ఇల్లూ, మంచి తోడూ అక్కడ దొరికేయి..." అన్నాడు భానుమూర్తి.

కొంచ మర్థమైనా – ఇంకొంచెం అర్థం కాక "అలాగే నాయనా!" అంది వాళ్ళమ్మగారు.

* * *

రైలు దిగి రిక్షాలో అమ్మని తీసుకొని వచ్చేస్తున్నాడు భానుమూర్తి– అమ్మచేతి తియ్యని లడ్డుండలూ, రోజూ వండే వంటలూ, గులాబీరంగు గోడలూ, మేడమీది గదులూ, రాఘవ రావుగారి అప్యాయతా, ఆయనకి వీటైనంత సంతృప్తి కలిగించబోయే భవిష్యత్తూ, ఇవన్నీ అతని మెదళ్ళో బోలేడు ఆనందాన్ని, కూసింత జాలినీ రేకెత్తిస్తున్నాయి.

రోడ్డుమీద ఎక్కడ బడితే అక్కడ నీటిగుంటలు చిన్నచెరువుల్లావున్నాయి. ఎండలో అవి కొత్తరకంగా మెరుస్తున్నాయి.

"ఏవయ్యా! వర్షాలు పడ్డాయా?" అని రిక్షావాణ్ణి అడిగాడు భానుమూర్తి.


"ఔను బాబూ! కుంభవృష్టిగా కురిసినై. మును పెప్పుడు ఇంతజోరుగా కురవలేదు," అన్నాడు రిక్షావాడు.

రిక్షా జోరుగా వెళ్తోంది. ఎండలో మెరుస్తున్న నీళ్ళు పైకి అందంగా చిమ్ముతున్నాయి.

"మేడ దగ్గిర కొచ్చేస్తున్నామమ్మా!" అన్నాడు భానుమూర్తి సంతోషా న్నాపుకోలేక. రిక్షాటర్నింగు తిరిగింది.

"ఏయ్ ఆపు;" గట్టిగా అరిచేడు భానుమూర్తి.

అతని కళ్ళెదురుగా వున్న దృశ్యాన్ని అతను నమ్మలేకపోయేడు. పీడకలలన్నీ ఒక్కసారి నిజమైనట్టనిపించింది. కళ్ళలోకి నిప్పులు ఒక్కుమ్మ




డిగా దూకినట్లయింది. గులాబీరంగు గోడలున్న గదులు రెండింటితో మేడ పయిఅంతస్తు కూలిపోయి వుంది. కింద అంతస్తు బాగానేవుంది. అప్పుడు సగం పున్నపు వెన్నెలతో బాటు మరో పక్క భయంకరమైన చీకటి మురిసినట్టయింది.

భానుమూర్తి రిక్షా దిగడం మర్చిపోయాడు. "ఈ మేడ...?"

"మొన్న వర్షాలకి కూలిపోయింది బాబూ! ఆ ఇల్లాయన...మా దొడ్డ పెబువు-సచ్చిపోయినాడు దూలం కింద పడి, కొడుకుని తల్సుకుంటూ. ఎప్పుడూ ఎల్లడు కాని అయాలే ఆ మేడ గదిలోకెళ్లేడు. దూలంకింద పడి, పేనం ఒగ్గేసేడు-మాదొడ్డ పెబువు. మంచోళ్లకే ఇన్ని బాదలు బాబూ!"

భానుమూర్తి తలను వెనక్కు వాల్చేడు. కన్నీళ్ళు కళ్ళలో తళుక్కున మెరిసి, బుగ్గలమీదుగా జారిపోతున్నాయి.

"భానూ! అంది వాళ్ళమ్మ చాలా గాభరాగా.

"రిక్షా పోనీమంటారా బాబూ!" అన్నాడు రిక్షావాడు.

"ఊఁ"

కూలిపోయిన 'మేడ' వెనక్కి, రిక్షా ముందుకి జరిగిపోయేయి.